# విశ్వ విద్యాలయ ఏర్పాటు హామీని నెరవేర్చాలి




-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి, ఉద్రిక్తత

7లో

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 16 | మార్చి | 2024
పేజీలు 8

## పనిభారం తగ్గించాలి..
# వేధింపులు ఆపాలి

-ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్స్‌ను పునరుద్ధరించాలి
-మీడియా సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ నేత బాబు
-నేటి నుంచి ఖమ్మంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు
-హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్టీసీ కార్మికులపై విపరీతమైన పనిభారం పడుతుందని విధుల నిర్వహణ కత్తిమీద సాములా మారిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పనిభారాన్ని తగ్గించేవిధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాబు తెలిపారు. యాజమాన్యం వేధింపులు కూడా కార్మికులపై పెరిగాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాబు మాట్లాడుతూ ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్ల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

మిగతా 2లో..

# లింక్ కలపండి సారూ..!



కొత్త, పాత బస్టాండ్ల మధ్య ప్రయాణ భారం

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో ఆధునీక వసతులతో నూతన బస్టాండ్ నిర్మాణం జరిగిన తర్వాత కొద్ది రోజులు పాత బస్టాండ్ భవితవ్యంపై తీవ్ర చర్చ జరిగింది. చివరకు చర్చోపచర్చల తర్వాత పాత బస్టాండ్‌ను కూడా వినియోగంలోకి తీసుకు వచ్చారు. పాత బస్టాండ్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పల్లె వెలుగు బస్సులను నడుపుతుండగా ఖమ్మం కొత్త బస్టాండ్‌ను ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు పరిమితం చేశారు. ఎక్స్‌ప్రెస్ దిగి పల్లె వెలుగు బస్సు ఎక్కేందుకు పాత బస్టాండ్‌కు వెళ్లాలన్న పాత బస్టాండ్‌లో పల్లె వెలుగు బస్సుల ద్వారా ఖమ్మం చేరుకుని సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే కొత్త బస్టాండ్‌కు చేరుకోవాలన్న ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంది. ఇక మహిళలైతే ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఖమ్మం చేరుకున్న బస్టాండ్లకు వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఆటో ఛార్జీలు చెల్లించడం ఇబ్బంది కరంగా మారింది. కొత్త, పాత బస్టాండ్లకు లింక్ సర్వీసులు లేకపోతే ఇబ్బంది అవుతుంది. పల్లె వెలుగు బస్సులను ఖచ్చితంగా కొత్త బస్టాండ్‌కు వచ్చి వెళ్లేవిధంగా చర్యలు తీసుకుంటే ఇక్కడ ఉన్న ప్రయాణికులు పాత బస్టాండ్‌కు చేరుకోవచ్చు. అదేవిధంగా పాత బస్టాండ్ నుంచి బయలు దేరిన పల్లె వెలుగు బస్సులు కొత్త బస్టాండ్‌కు అనుసంధానమైతే అక్కడి ప్రయాణికులు కూడా ఇక్కడకు చేరుకోవచ్చు. ప్రయాణికులకు సౌకర్యంతో పాటు సమయం కలిసి వస్తుంది. అవసరమైతే అదనపు ఛార్జీని చెల్లించేందుకు కూడా ప్రయాణికులు సిద్ధంగా ఉన్నారు. బస్టాండ్‌లో దిగి వేరే వాహనాలను ఆశ్రయించి బస్టాండ్‌కు వెళ్లే కంటే అదే బస్సులో అదనపు ఛార్జీ ఇచ్చి వెళ్లడం తేలికన్న భావన ప్రయాణికుల్లో ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని గమనంలోకి తీసుకుని కొత్త, పాత బస్టాండ్లను అనుసంధానం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. మినీ బస్సు సర్వీసులను కూడా ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి నగరంలో తిప్పాలని కోరుతున్నారు.

# ఉపాధి చెల్లింపులకు గ్రహణం



- నాలుగు నెలలుగా సిబ్బందికి అందని వేతనాలు
- నిలిచిపోయిన రూ.28 కోట్ల జీతభత్యాలు
- కూలీలదీ అదే పరిస్థితి
- పని ప్రదేశంలో సౌకర్యాలు కరువు
- ఆదుకోవాలంటూ ప్రభుత్వాలకు వేడుకోలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉపాధి చెల్లింపులకు గ్రహణం పట్టింది. నాలుగు మాసాలుగా ఉపాధిహామీ సిబ్బందికి వేతనాలు అందక కుటుంబాల పోషణ భారంగా మారింది. మరో ప్రక్క ఉపాధికూలీలకు కూడా ఫిబ్రవరి 3వ తేది తర్వాత ఒక్క రూపాయి కూడా జమ కాలేదు, వేసవి కాలంలో ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో మౌళిక సదుపాయాలు కూడా కరువయ్యాయి. గ్రామాల్లో నివసించే ప్రజలకు వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత ఏ రకమైన పనులు లేక పూట గడవడం కష్టంగా మారుతుందని, పచ్చని పల్లెలను వదిలి పట్టణాలకు వలసలు పోతున్నట్లు గ్రహించిన అప్పటి యూపిఏ ప్రభుత్వం 2005 వ సం.లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా పల్లెల్లో పలు రకాల పనులను కల్పిస్తుండటంతో పల్లెల్లో కనీస సౌకర్యాలు సమకూరుకుంటున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించేందుకు శ్రమిస్తున్న ఉపాధిహామి సిబ్బందికి వేతనాలు లేక వెతలుపడుతున్నారు. ఇంటి అద్దె, పిల్లలు చదువులు, నిత్యవసరాలు వంటి వాటి కోసం కూడా అప్పులు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

**కీలకం...**

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం క్రింద పల్లెల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రైతువేదిక నిర్మాణం, ప్రకృతి వనాలు, వైకుంతధామాలు, నర్సరీలు, కాంపొండ్‌లు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు,

మిగతా 2లో..

## ఖమ్మం నగరాన్ని
# ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 47వ డివిజన్‌లో రూ.70.21 లక్షలు, 57వ డివిజన్‌లో రూ. 72 లక్షలు, ఐదవ డివిజన్‌లో రూ. 72 లక్షలు, రెండవ డివిజన్‌లో రూ. 72 లక్షలు, ఎనిమిదవ డివిజన్‌లో రూ.72 లక్షలు, 27వ డివిజన్‌లో రూ. 74 లక్షలతో చేపట్టే సిసి రోడ్లు, సైడ్ కాలువ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రూ. 25 కోట్ల అంచనాలతో చేపట్టే ఖమ్మం, కోదుమూరు, అల్లిపురం నాలుగు లైన్ల రహదారి

మిగతా 2లో..

# ఉపాధి చెల్లింపులకు గ్రహణం



**(మొదటిపేజీ తరువాయి)**

మురుగు కాల్వలు, చెరువుల పూడిక తీతలు, గ్రామీణక్రీడా ప్రాంగణాల నిర్మాణం, హరితహారం, ప్లాంటేషన్, పశువుల షెడ్లు, సిసి రోడ్లు, గ్రామపంచాయితీ, అంగన్‌వాడీ భవనాలు వంటి అనేక పనులు ఈ పథకం ద్వారా కొనసాగుతున్నాయి. గ్రామీణాభివృద్ధికి ఈ పథకమే కీలకంగా ఉంది.

**నిలిచిపోయిన రూ.28 కోట్ల వేతనాలు ...**

ఉపాధిహామీ పథకంలో పలు విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి చెందిన నాలుగు నెలల వేతనాలు నిలిచిపోయాయి. నెలకు రూ.6 కోట్ల 97 లక్షల 9 వేలు చెల్లించాల్సి ఉంది. మొత్తం 4 నెలలుగా రూ.27 కోట్ల 91 లక్షల 6 వేల వేతనాలు నిలిచిపోయాయి. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్కీంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఏపిఓలు 11 మంది, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లు 16 మంది, టెక్నికల్ అసిస్టెంట్‌లు 94 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 38 మంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు 230 మంది విధులు నిర్వహిస్తున్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కూలీల పరిస్థితి ఇదే ...**

కూలీల చెల్లింపుల్లో కూడా తీవ్ర జాప్యం జరుగుతోంది. వ్యాప్తంగా 2 లక్షల 29 వేల జాబ్ కార్డులు ఉన్నాయి. కానీ కూలీ పనులకు వచ్చేది మాత్రం అతి తక్కువ మందే. జిల్లాలోని 480 గ్రామపంచాయితీలకు గానూ ఒక్కొక్క గ్రామపంచాయితీ నుండి సుమారు 50 మంది మాత్రమే కూలీ పనులకు హాజరువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఫిబ్రవరి 2వ తేది మొదలుకుని నేటి వరకువ కరువు పని డబ్బులు రాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో ప్రక్క ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో మౌళిక సదుపాయాల కల్పన కనుమరుగైంది. టెంట్లు, మంచినీటి సదుపాయాన్ని కల్పించడం లేదు. ఆరేడేళ్ల క్రితం ఇచ్చిన టెంట్లే ఇప్పటికీ అక్కడక్కడా వాడుతున్నారు. అవి రంధ్రాలు పడి, పాడై పనికి రాకుండా ఉన్నప్పటికీ వాడకతప్పడం లేదని, కనీసం మంచినీరు కూడా పని ప్రదేశంలో ఇవ్వడటం లేదని కూలీలు అంటున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వేతాలు, కూలీలు చెల్లించి, పనిప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

### ఉద్యమ గుమ్మం ఖమ్మంలో

# ఈయు రాష్ట్ర మహాసభలు






**-మహాసభలలో ఉద్యమ కార్యాచరణ**
**-హాజరు కానున్న 250 మంది ప్రతినిధులు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్టీసీ కార్మికులు త్రిశంకు స్వర్గంలో ఉన్న నేపథ్యమిది. గత ప్రభుత్వం నియంత ధోరణితో ఆర్టీసీలో యూనియన్లనే రద్దు చేసిన తర్వాత కార్మికుల గొంతుక మూగబోయింది. దశాబ్దాల తరబడి ఆర్టీసీ కార్మికుల పక్షాన ఉద్యమ గొంతుకగా ఉన్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ల రద్దుతో పాటు యాజమాన్య పెడధోరణులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వస్తున్నది. అవసరమైనప్పుడు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నది. ప్రభుత్వం మారితే ఆర్టీసీ కార్మికుల జీవితాలలో మార్పుతో పాటు సంక్షేమ పథకాలు ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, యూనియన్లకు చట్టబద్దత తదితర విషయాలు అమలవుతాయని ఆశించారు. ప్రజల అభిమాతానికి అనుగుణంగా 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పనులు చేసినప్పటికీ ఆర్టీసీ పట్ల మాత్రం వివక్ష ధోరణినే అవలంభిస్తుందని చెప్పక తప్పదు. 100 రోజుల్లో సింగరేణి సహా అటు కార్పోరేషన్లలోను ఇటు ప్రభుత్వ సంస్థల్లోను మార్పులు చోటు చేసుకున్నా ఆర్టీసీలో మాత్రం చింతాకంత మార్పు కనిపించలేదు. ముఖ్యంగా 2023లో అప్పటి కేసిఆర్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ ఇంత వరకు కార్యాచరణ రూపు దాల్చలేదు. అపాయింట్‌మెంట్ డేటు నిర్ధారించ లేదు. అది ఎప్పుడు జరుగుతుందో, ఎలా జరుగుతుందో ఇప్పటికీ అర్థం కానీ స్థితి. ఆర్టీసీ కార్మికుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. గతంలో మాదిరి కార్పోరేషన్ పరిధిలో ఉండి యూనియన్ల పోరాటం ద్వారా తమ హక్కులను సాధించుకోవడమే కాకుండా సంక్షేమ పథకాలను అమలు చేసుకునే అవకాశాన్ని కోల్పోయారు. ప్రభుత్వ ఉద్యోగులుగా లబ్ది పొందక పోగా ఊగిస లాట ధోరణే మొదలైంది. ఇదే అదునుగా యాజమాన్యాలు పని భారాన్ని పెంచేశాయి. మూడు నెలల్లో 22 కోట్ల మంది ప్రయాణించారంటే ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీలో ఉన్న సిబ్బంది, బస్సుల సంఖ్యను బట్టి ఆర్టీసీ కార్మికుల పై ఎంతటి పని భారం పడిందో ఊహించుకోవచ్చు. 100 రోజుల పాలనలో కనీసం ఆర్టీసీ గురించి ప్రభుత్వం ముచ్చటించిన దాఖలాలు లేవు. 2017 వేతన సవరణ కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండానే 21 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. ఇది వాస్తవంగా చాలా తక్కువ పైగా వేతనాల్లో పెద్ద మార్పు వచ్చిందన్న మీడియా ప్రచారంలో వాస్తవం లేని నేపథ్యం. ఇక హెచ్‌ఆర్‌ఏ ప్రభుత్వ ఉద్యోగులదే తగ్గించే ఆలోచనలో ఉన్నప్పుడు ఇక ఆర్టీసీ కార్మికుల వేతనం మరింత తగ్గే అవకాశం ఉంది. 21 శాతం ఫిట్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఇక ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం తొమ్మిది డిఏల బకాయి చెల్లించాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయడం లేదని ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని స్వాగతిస్తూనే పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ సిబ్బందిని, బస్సులను , ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగి విపరీతమైన రద్దీ ఏర్పడుతుందని దీని కారణంగా ఆర్టీసీ కార్మికులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని పని భారం కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని కార్మికులు వాపోతున్నారు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో డ్రైవర్ల పట్ల తీసుకున్న వైఖరి హేతుబద్ధంగా లేదు. ఈ చట్టాన్ని అమలు చేస్తే దేశంలో ఎవరు డ్రైవర్‌గా పనిచేసేందుకు ముందుకు రాకపోవచ్చు. కార్మికుల పోరాట ఫలితంగా తాత్కాలికంగా దీనిని వాయిదా వేసిన భవిష్యత్తులో మళ్లీ అమలు చేసే అవకాశం ఉంది. దీనిని పూర్తిగా రద్దు చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర తృతీయ మహాసభల సందర్భంగా ప్రభుత్వానికి తమ సమస్యలను విన్నవించడమే కాకుండా పరిష్కారం చేయకపోతే ఉద్యమ కార్యాచరణకు సైతం పోరాట చరిత్ర కలిగిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సిద్ధమవుతుంది. ప్రధానంగా ఆర్టీసీ సిబ్బందిని, బస్సులను పెంపుదల చేస్తూ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వివిధ స్థాయిల్లో నియమాకాలు చేపట్టాలని 21 శాతం ఫిట్ మెంట్ పై పునరాలోచన చేయాలని, తొమ్మిది డిఏల బకాయిలను వరుస క్రమంలో చెల్లించాలని ప్రధానంగా ఆర్టీసీలో యూనియన్ల పునరుద్దరించాలని అన్నింటికి మించి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మహాసభలో డిమాండ్ చేయనున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి 250 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరు కానున్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చించి తగు కార్యాచరణ రూపొందించనున్నారు.

### ఖమ్మం నగరాన్ని

# ఆదర్శంగా తీర్చిదిద్దుతా..





**(మొదటిపేజీ తరువాయి)**

విస్తీర్ణ పనులకు అల్లిపురం వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఖమ్మం నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూర్చనున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నలువైపులా విస్తరించిన ఖమ్మం నగరాన్ని అభివృద్ధి కోసం నిధుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్పోరేషన్‌లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టిసారించినట్లు ఆయన తెలిపారు. 57వ డివిజన్ వికలాంగుల కాలనీ వద్ద నగర పాలక సంస్థ సిబ్బందికి చెందిన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఇట్టి మిషనరీ నగర పాలక సంస్థకు చెందిన లిక్విడ్ వేస్ట్ పై పనిచేసే వారికి, మ్యానువల్ స్కావెంజింగ్ కాకుండా మిషనరీతో క్లీనింగ్ చేసేటట్లుగా నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్షియల్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణ సౌకర్యం ద్వారా అందించబడింది. ఇట్టి యూనిట్ విలువ రూ.19.34 లక్షలు కాగా సబ్సిడీ మొత్తం రూ.8.50 లక్షలు. సబ్సిడీ పోను మిగిలిన మొత్తం వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుంది. ఇట్టి మిషనరీ నగర పాలక సంస్థ ఎంగేజ్ చేసుకుని వారికి ఉపాధి కల్పించనుంది. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ శ్యాంప్రసాద్, పిఆర్‌ఎస్‌ఈ చంద్రమౌళి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పనిభారం తగ్గించాలి..

# వేధింపులు ఆపాలి

**(మొదటిపేజీ తరువాయి)**

నిరంకుశంగా నియంతలా వ్యవహరించిన కేసిఆర్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్లను రద్దు చేసిందని కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 100 రోజుల్లో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిన ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ మాత్రం పూర్తి కాలేదన్నారు. 2023లోనే విలీన ప్రక్రియ ప్రారంభించినా అపాయింట్‌మెంట్ డేట్‌ను ప్రకటించలేదని, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించబడటం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ తక్షణం అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలని బాబు కోరారు. 2017 వేతన సవరణను ట్రేడ్ యూనియన్ లేకుండా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించిన బాబు 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం వలన ఆర్టీసీ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని బాబు తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు 21 శాతం పెరిగిన తర్వాత వేలకు వేలు పెరిగాయని ప్రచారం జరుగుతుందని కానీ స్వల్పంగానే వేతనాలు పెరిగాయని హెచ్‌ఆర్‌ఏ తగ్గితే మళ్లీ తగ్గుతాయన్నారు. తొమ్మిది డిఏల బకాయిలున్నాయని వాటిని వెంటనే చెల్లించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సహిత చట్టంతో డ్రైవర్లు పని చేయలేని పరిస్థితి ఉందని ఆ చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ ప్రయాణికులు పెరిగారని అందుకు తగ్గట్లు సిబ్బందిని, బస్సుల సంఖ్యను పెంచాలని ఆయన కోరారు.

**నేటి నుంచి రాష్ట్ర మహాసభలు....**

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో ఈనెల 16, 17 తేదీలలో ఖమ్మంలోని టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్నాయని బాబు తెలిపారు. ఈ మహాసభలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు లు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డిపోలకు, రీజియన్లకు ప్రాతినిథ్యం వహిస్తూ 250 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని ఈ మహాసభలలో ఆర్టీసీ కార్మికుల సమస్యను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు బాబు తెలిపారు. మీడియా సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ. వెంకన్న, రాష్ట్ర నాయకులు తిమ్మినేని రామారావు, పాటి అప్పారావు, ఖమ్మం రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, యూనియన్ నాయకులు బుచ్చిబాబు, బివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు ఇండ్లు కేటాయించాలని మంత్రి తుమ్మలకు వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని నిరుపేద ఆటో డ్రైవర్లకు ఇండ్లు కేటాయించాలని ఐఎన్‌టియుసి ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం ఐఎన్‌టియుసి ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ విప్లవ్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విప్లవ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది కార్మికులు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారని వారికి కనీస సౌకర్యాలు లేవన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ఫీజులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రోజు వచ్చే డబ్బులు డీజిల్, కిరాయిలకే సరిపోతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా స్థలమున్న ఆటో డ్రైవర్లకు ఐదు లక్షలు కేటాయించాలని స్థలం లేని వారికి స్థలంతో పాటు ఐదు లక్షలు కేటాయించాలని కోరారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు త్వరలో ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో



యూనియన్ జిల్లా అధ్యక్షులు బొల్లిని నాగరాజు, కోశాధికారి తోట సైదులు, నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నగర కమిటీ సభ్యులు నర్సింహారావు, ఎం. వెంకట్ నాయుడు, బాలకృష్ణ, జాని, గోపాల్, శంకర్, నాగ హుస్సేన్, గోపి పాల్గొన్నారు.

## ఎనేబుల్ ఇండియా ఆధ్వర్యంలో హమారీ వాణి ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎనేబుల్ ఇండియా ఆధ్వర్యంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్లాట్ ఫాం హమారీ వాణి ని ప్రారంభించారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని రోటరీ క్లబ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దివ్యాంగుల సంక్షేమ శాఖాధికారి రాంగోపాల్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ అజయ్‌కుమార్, ఎనేబుల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. హమారీ వాణి గురించి వివరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ఎనేబుల్ ఇండియా దేశంలోనే మొట్టమొదటిసారిగా బెంగళూరులో నమ్మా వాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో దివ్యాంగులకు వారికి కావాల్సిన సమాచారాన్ని, ప్రభుత్వ పథకాలు, ప్రత్యేక నైపుణ్యతను వెలికితీసి సమాజంలో అందరికీ ఉపయోగపడే సమాచారాన్ని వ్యాప్తి చెందేలా ఈ నమ్మా వాణి కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమం కేవలం మామూలు ఫోన్ ద్వారా ఇంటర్నేట్, రీచార్జ్ లేకుండా ఉపయోగించడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం అంచలంచెలుగా హిందీలోని హమారీ వాణి, ఇంగ్లీష్‌లోని ఎనేబుల్ వాణి, తమిళంలో కూరెళ్ల మధు, బెంగాల్‌లోని బంగ్లా భాషలో విస్తరింప జేసి సుమారు 80వేల మంది సభ్యత్వాలతో రికార్డు చేయబడిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాల కొరకు హమారీ వాణిని హిందీలో ఉపయోగించుకోవచ్చునని భవిష్యత్తులో తెలుగు భాషలో కూడా దివ్యాంగులకు ఉపయోగపడేలా తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం హిందీలోని హమారీ వాణిని 9266344222 ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌డిఐఎస్ డైరెక్టర్ గడ్డం రాంబాబు, జిల్లా కో ఆర్డినేటర్ మల్లికార్జున్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


### తనికెళ్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అబ్రహం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి అబ్రహం అన్నారు. మండల పరిధిలోని తనికెళ్ల హైస్కూల్‌లో శుక్రవారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదోతరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా అబ్రహాం మాట్లాడుతు పరిశసీతారత్నం చారిటబుల్ విద్యారంగానికి చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. గతంలో కూడా పాఠశాలకు కుర్చీలు అందించారని అంతేకాకుండా పాఠశాల మెరిట్ విద్యార్థులకు జ్ఞాపికలు అందించారని తెలిపారు. రూపాయికి రూపాయి కూడబెట్టుకొని ఆస్తులు సంపాదిస్తున్న ఈ రోజుల్లో విద్యార్థులకు ఆర్థికంగా ఉపయోపడుతున్నాడని అన్నారు. చదువుపై మక్కువ ఉండి పై చదువులు చదువుకోలేని ఆర్థిక స్తోమతలేని విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనిస్తున్నాడని పేర్కొన్నారు. పరిశ సీతారత్నం ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతు మీరు చదివిన చదువుకు పరీక్షల్లో మీరు సాధించిన ఉత్తమ మార్కులను చూసి ఊరు మురిసి పోవాలని అన్నారు. చదువునేర్పిన గురువులను గుర్తుంచుకోవాలని మీరు ఎంత పై చదువులు చదివినా గురువులు కనిపిస్తే నమస్కారం చేసి నేను మీ శిష్యుడను నేను ఫలానో హోదాలో ఉన్నానని చెబితే ఆగురువు ఎంతో సంబర పడిపోతాడని అన్నారు. మనలను కన్న తల్లితండ్రులు కూడా మన కుటుంబ సబుల పట్ల ప్రేమలో కాని ఆస్థి పంపకాల్లో కాని స్వార్థం చూపిస్తారు కాని చదువునేర్పిన గురువులు మాత్రం తన విద్యను అందరికి సమానంగా పంచుతాడని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఖజానా అధికారి పసుమర్తి సుధాకర్‌రావు , గ్రామస్థులు పసుమర్తి శంకర్‌రావు , పసుమర్తి సత్యనారాయణ , ఉపాధ్యాయులు శ్రీనివాస్ , సాగర్ , చంద్రశేఖర్ , జకీరాబేగం , ఎస్‌విఎన్ మూర్తి , జనార్థన్‌రావు , సురేష్ కుమార్ , రాజారత్నం , నాగమణి , లక్ష్మీ ప్రియ , వెంకటేశ్వరరావు , ఆర్ ఇ సావిత్రి , ప్రభాకర్ , కె సునీత , యస్ సునీత, నూర్జహాన్ బేగం , జగన్మోహన్‌రావు , సుభాషిణి , విద్యార్థిని , విద్యార్థులు పాల్గొన్నారు.

## కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత

### - మధిర ఎక్సైజ్ సిఐ రామ్మూర్తి వెల్లడి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో భువనేశ్వర్ నుండి ముంబై వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 9కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు మధిర ఎక్సైజ్ సిఐ జంపాల రామ్మూర్తి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు రైల్వే జిఆర్‌పి పోలీసులతో కలిసి కోణార్క్ రైలులో తనిఖీలు నిర్వహించగా గంజాయిని ప్యాకెట్లుగా తరలిస్తున్న బ్యాగులను గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు. బ్యాగులకు సంబంధించిన నిందితులను ఎవరిని గుర్తించడం జరగలేదని తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలు గంజాయి తదితర మాదక ద్రవ్యాలను సరఫరా చేసినా, వినియోగించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై సి.జనార్ధన్‌రెడ్డి, ముస్తాఫా, గోపి, రజాక్, నాగరాజు తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఎంపి నామా జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు, బిఆర్‌ఎస్ లోక్ సభ పక్షనేత నామా నాగేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా మధిరలో బిఆర్‌ఎస్ పార్టీ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని వినాయకుని ఆలయంలో, జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎంపి నామా పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, అరిగే శ్రీనివాసరావు, తాళ్ళూరి హరీష్‌బాబు, రంగిశెట్టి కోటేశ్వరరావు చావా వేణు, యన్నంశెట్టి అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కోటారి రాఘవరావు, గద్దల రాజా, నాని, వేల్పుల శివ, అబ్దుల్ కూరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కమ్మ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్మ కార్పొరేషన్ ప్రకటించిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీసిఎం మల్లు భట్టివిక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్పొరేషన్ వలన కమ్మ కులానికి చెందిన వెనుబడిన విద్యార్థులకు, యువకులకు, మహిళలకు ఆర్థిక తోడ్పాటునందించటం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భరత్ విద్యాసంస్థల్లో సరస్వతీ పూజ






**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని భరత్ విద్యాసంస్థల్లో గురువారం విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులచే ప్రత్యేక సరస్వతీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ శీలం విద్యాలత మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుండి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, ఉమా, డీన్ రవీందర్‌రెడ్డి, స్రవంతి, నాగరాజు, అజీమ్, పాషా, గణేష్, రమేష్, హెప్సిభా, శశిక, రాజేశ్వరి, పద్మ, రాజ్యలక్ష్మీ , స్వాతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలోని పలు షాపుల్లో చోరీలు





**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పట్టణంలోని పలు దుకాణాల్లో గురువారం తెల్లవారుజామున పలు చోట్ల చోరీలు జరిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో పలు దుకాణాల్లో తలుపులు పగులకొట్టి లోనికి చొరబడి పలురకాల వస్తువలతో పాటు కొంత నగదు చోరీకి గురైనట్లు దుకాణాదారులు తెలిపారు. ఈ సంఘటనలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణ ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ ప్రకటించిన సందర్భంగా కమ్మ సంఘం ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా కమ్మ సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కమ్మ సామాజిక వర్గంలో ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాలు విద్య, వైద్యానికి నోచుకోకుండా ఇబ్బందిపడుతున్నారన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో వారికి న్యాయం జరుగుతుందన్నారు. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంట్ సభ్యురాలు రేణుకచౌదరికి కమ్మ సంఘం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెగాళ్ళపు చెన్నకేశవరావు, జేష్ట సత్యనారాయణచౌదరి, సుంకవల్లి వీరభద్రరావు, కాసాని వెంకటేశ్వరరావు, కమ్మ సంఘం అధ్యక్షులు సంకురాత్రి సతీష్, తలసీల ప్రసాద్, అల్లూరి బుజ్జి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడిగా నరేష్



ప్రజాపక్షం/సుజాతనగర్: కొత్తగూడెం నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడుగా పూరేటి నరేష్ హైదరాబాద్ ప్రజా భవన్ లో శుక్రవారం డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క చేతుల మీదుగా నియామాక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పూరేటి నరేష్ మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్కకి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శి కొదుమూరి దయాకర్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కేశబోయిన నరసింహారావు, టిపిసిసి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి వీరాపురం రామలక్ష్మణ్ కు ఈ సందర్భంగా పూరేటి ధన్యవాదాలు తెలిపారు.

## కాన్షీరాం ఆశయసాధన కోసం ఉద్యమించాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : కాన్షీరాం ఆశయ సాధన కోసం ఉద్యమించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పగిడికత్తుల ఈదయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం కాన్షీరాం జయంతి కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....బహజన రాజ్యాధికారం కోసం శ్రమించి సాధించిన ఏకైక వ్యక్తి గా చరిత్రలో నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్దపాక వెంకటేశ్వర్లు, పగిడికత్తుల నాగేశ్వరరావు, మాదాసు వెంకన్న, గుడిపాటి ముక్కంటి, నాగరాజు, కిరణ్, మహేష్, కళ్యాణ్, సత్యం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం...!

### -మాజీ సీడీసీ చైర్మన్ కారును ఢీకొట్టిన టిప్పర్



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండల కేంద్రంలో మాజీ సీడీసీ చైర్మన్ కు తృటి లో ప్రమాదం తప్పింది. స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని మంగ్రాజుపల్లి గ్రామానికి చెందిన చెరుకు అభివృద్ధి మండలి మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్ కు తృటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం మంగ్రాజుపల్లి నుంచి నేలకొండపల్లి కి కారు లో వస్తుండుగా....మండల కేంద్రం లోని మూలమలుపు వద్ద కు రాగానే జాతీయ రహదారి నిర్మాణ పనులకు మట్టి తరలిస్తున్న టిప్పర్ కారు ను ఢీకొట్టింది. దీంతో కారు దెబ్బతిన్నది. ప్రమాద సమయంలో మాజీ చైర్మన్ లీలాప్రసాద్ కారు డ్రైవింగ్ చేస్తున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. అక్కడ కొద్ది సేపు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అనంతరం నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్ కు పంచాయతీ చేరింది.

## రైల్వే డిఆర్ఎంకు వినతి



ప్రజాపక్షం/ బోనకల్ : నూతనంగా ఏర్పాటు చేసిన మూడవ లైన్ తనిఖీల్లో భాగంగా శుక్రవారం బోనకల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించిన సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ భర్తేష్‌కుమార్ జైన్‌ను బోనకల్ మండల అఖిలపక్ష నాయకులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. మండల కేంద్రంలో రైల్వే ప్లైఓవర్ నిర్మించడం వలన అక్కడ నివసిస్తున్న ప్రజలు ఖమ్మం బస్టాండ్ వైపుకు వెళ్లాలంటే సుమారు నాలుగు కిలోమీటర్లు చుట్టూతిరిగి వెళ్లాల్సి వస్తుందని, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించి ప్రజల సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంగా ఉన్న బోనకల్ రైల్వేస్టేషనలో శాతవాహన, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు గుగులోతు పంతు, కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేశ్వర్లు, పన్నసబోయిన వీరభద్రం, ఆర్యవైశ్య సంఘ నాయకులు పల్లపోతుల గోపి, రంగా, జనార్ధన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ గౌతమ్‌కు సన్మానం



ప్రజాపక్షం/ బోనకల్ : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఎస్సీలకు చెందిన 36 ఎకరాల ఎనాం భూమికి పట్టాదార్ పాసు పుస్తకాలను మంజూరు చేయించిన జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్‌కు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత 60సంవత్సరాలుగా ఎనాం భూములకు ఎటువంటి హక్కులు లేవని, ఈ విషయాన్ని జెడ్పిటిసి సుధీర్‌బాబు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి 36 ఎకరాలకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పించటం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తాటికొండ అచ్చయ్య, జయరాజు, కిరణ్, దావీద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు పర్యవేక్షణలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆటో డ్రైవర్లు, సంఘాలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టి పెట్టుకుని ట్రాఫిక్ అంతరాయాన్ని నియంత్రించేందుకు దృష్టిపెట్టినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్, బస్టాండ్, వైరా రోడ్డు ప్రాంతం నిత్యం ప్రయాణికులతో ఆటోలతో రద్దీగా ఉంటుంది కాబట్టి ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలకు చేర్చాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే ఆకతాయిలపై చర్యలు తప్పవని తెలిపారు. మీ ఆటోలో కూర్చున్న ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అదేవిధంగా ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందనే విషయాన్ని గ్రహించి ఆటోలు క్రమ పద్ధతిలో నడుపుకోవాలని సూచించారు. డ్రైవర్లందరూ తప్పనిసరిగా యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్సలు, వారి వాహనాలకు ఆర్‌సి కలిగి ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో నగరంలో పోలీసులు తీసుకునే చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన పలు ప్రమదాల సంఘటనల్లో ఆటోలు కారణంగా మారుతున్నాయని ఇలాంటి సంఘటనలకు దూరంగా ఉంటూ తమ ప్రయాణాలు సాఫీగా సాగించుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నడిపి ప్రమాదాల భారీన పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. తమ వెనక కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారని గుర్తు పెట్టుకుని ఆటోలు సురక్షితంగా నడుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ మోహన్‌బాబు, ఎస్‌ఐ రవి, వెంకన్న, ఆర్ఎస్ఐ సాగర్ పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థలో ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ఆయా విభాగాలలో ఖాళీగా ఉన్న 327 పోస్టులను ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో (ఎక్స్‌టర్నల్) ఎంప్లాయ్మెంట్ నోటిఫికేషన్ నెంబర్ 02/2024, 813 పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయుటకు గురువారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేశామని జిఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కే.బసవయ్య శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో (ఎక్స్‌టర్నల్) భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు : ఎగ్జిక్యూటివ్ క్యాడర్ లో మేనేజ్మెంట్ ట్రైనీ (ఈఅండ్ఎం) పోస్టులు 42, మేనేజ్మెంట్ ట్రైనీ (సిస్టమ్స్) పోస్టులు 7 మరియు నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్ లో జూనియర్ ఇంజనీర్ ట్రైనీ (జేఎంఈటి) పోస్టులు 100, అసిస్టెంట్ ఫోర్మన్(మెకానికల్) ట్రైనీ పోస్టులు 9, అసిస్టెంట్ ఫోర్మన్ (ఎలక్ట్రికల్) పోస్టులు 24, ఫిట్టర్ ట్రైనీ పోస్టులు 47, ఎలెక్ట్రీషియన్ ట్రైనీ పోస్టులు 98 కలిపి మొత్తం 328 పోస్టులు ఎంప్లాయ్మెంట్ నోటిఫికేషన్ నెంబర్ 02/2024 లో ఉన్నాయని, ఈ పోస్టులకు ఏప్రిల్ 15 తేదీ నుంచి మే నెల 05 వ తేదీ వరకు ఆన్ లైన్లో దర ఖాస్తు చేసుకోవచ్చని పూర్తి వివరాల కోసం ఏప్రిల్ 15 తేదీ తేదీ నుంచి సింగరేణి సంస్థ వెబ్సైట్ (https://scclmines.com) తెలిపారు. అంతర్గత (ఇంటర్నల్) పద్ధతిలో భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు : ఎగ్జిక్యూటివ్ క్యాడర్ లో మైనింగ్ గ్రాడ్యుఎట్ ట్రైనీ పోస్టులు 22, అండర్ మేనేజర్ పోస్టులు 20, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు 06, మరియు నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్ లో జూనియర్ అసిస్టంట్ పోస్టులు 360 , జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ (జేఎంఈటి) పోస్టులు 100 , అసిస్టంట్ ఫోర్మన్(మెకానికల్) ట్రైనీ పోస్టులు 10, అసిస్టంట్ ఫోర్మన్(ఎలెక్టికల్) పోస్టులు 25, ఫిట్టర్ ట్రైనీ పోస్టులు 123, ఎలెక్ట్రీషియన్ ట్రైనీ పోస్టులు 133, వెల్డర్ ట్రైనీ పోస్టులు 14 కలిపి మొత్తం 813 ఈ అంతర్గత (ఇంటర్నల్) నోటిఫికేషన్ ఇందులో ఉన్నాయని, ఈ పోస్టులకు మార్చి 20 తేదీ నుంచి 30 వ తేదీ వరకు ఆన్ లైన్లో దర ఖాస్తు చేసుకోవచ్చని పూర్తి వివరాల కోసం మార్చి 20 వ తేదీ నుంచి సింగరేణి సంస్థ వెబ్సైట్ (https://scclmines.com) చూడవచ్చని తెలిపారు.ఈ సంధర్భముగా జిఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కే.బసవయ్య మాట్లాడుతూ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ ఆదేశాల మేరకు ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో (ఎక్సర్నల్) 327 పోస్టులకు, అంతర్గత అభ్యర్థుల కొరకు 813 పోస్టుల కొరకు నోటిఫికేషన్ జారీచేశామని, ఇవే కాక ఈ నెల6 వ తేదీన అంతర్గత అభ్యర్థుల కొరకు 173 పోస్టుల కొరకు, గత నెలలో సింగరేణి సంస్థ లో ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో భర్తీ చేయుటకు మొదటి విడతగా 272 పోస్టుల భర్తీకి తేదీ : 22.02.2024 నాడు ఎంప్లాయ్మెంట్ నోటిఫికేషన్ నెంబర్ 01/2024 ప్రకారం విడుదల చేశామని తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం కలిపి ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు 600 పోస్టుల కొరకు నోటిఫికేషన్ ఇచ్చామని, సంస్థ లో ఖాళీ గా ఉన్న 1241 అంతర్గత (ఇంటర్నల్) పోస్టులను గాను ఇప్పటి వరకు 986 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేశామని, 60 ఈపి ఆపరేటర్ పోస్టులను భర్తీ చేయుటకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని, అదే విధంగా ఆయా విభాగాలలో ఖాళీగా ఉన్న 200 పోస్టులను ప్రమోషన్స్ పద్ధతిలో అతి త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. ఈ పోస్టులన్నీ వ్రాతపరీక్షా ఆధారముగా పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని, దళారులను నమ్మి ఎవరు మోసపోవద్దని, ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మెసేజ్, ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే ప్రలోభాలకు గురికాకుండా వెంటనే ఏసిబి లేదా సింగరేణి సంస్థ విజిలెన్స్ డిపార్ట్మెంట్ వారికి తేలేయజేయాలని అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం, ఐఆర్ఎస్ తెలిపారు.

## నేడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : రాష్ట్ర రెవిన్యూ,గృహనిర్మాణం,సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాలేరునియోజకవర్గంలో నేడు(శనివారం) పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30గంటలకు కూసుమంచిలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అదేవిధంగా 10గంటలకు జీళ్లచెర్వులో సీసీరోడ్లను ప్రారంభిస్తారన్నారు. అక్కడి నుంచి నేలకొండపల్లి చేరుకుని చెన్నారం గ్రామంలో 11గంటలకు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ఆ ప్రాంత లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి , చెక్కులను పంపిణి చేస్తారన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 12గంటలకు చెర్వుమాదారంలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అక్కడి నుంచి ఖమ్మం రూరల్ మండలంలోని కైకొండాయిగూడేనికి చేరుకుని 1గంటకు సీసీరోడ్లు,డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం సాయంత్రం 4గంటలకు మహబూబాద్‌లో జరిగే పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరవుతారన్నారు. కావున కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు, శీనన్న అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యి విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## దానవాయిగూడెం చెక్‌డ్యాం ఎత్తును పెంచాలి

### -ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు ఆలోచనచేయాలి
### -ఈత మిత్రుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల





ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రెండు రాష్ట్రాలు పోటి పడి శ్రీశైలం,నాగార్జునసాగర్ నీటిని కిందికి వదిలేయడంతో మంచినీటి సమస్య ఏర్పడిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మంత్రి ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లిలో గల గురుదత్తా ఫౌండేషన్ సందర్శించి,ఈత మిత్రులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రజల ఆలోచనలకు తగ్గట్టుగానే ముందుకు వెలతామని, ఒక వేళా దానికి భిన్నమైన పరిస్థితులు చేయాల్సి వచ్చినప్పుడు ఆ పనికి పూనుకోమన్నారు. కాంగ్రెస్ పార్టీ రావాలని ప్రజలు సంకల్పించడంతోనే ప్రజాప్రభుత్వం ఏర్పాటు సాధ్యమయ్యిందన్నారు. కానీ గత ప్రభుత్వం తప్పిదాలతో అన్నిశాఖలలో తప్పిదాలు, నష్టాలు, కష్టాలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ ప్రజలు ఇచ్చిన తీర్పు, ధైర్యం, విశ్వాసంతో సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలో అధిగమిస్తామన్నారు. మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని, పరిష్కారం చేయనున్నట్టు పేర్కొన్నారు. గురుదత్తా ఫౌండేషన్ సేవలు విస్త పరచి, విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు మరన్ని సేవలను అందించాలన్నారు. ఫౌండేషన్‌కు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు,అప్రోచ్ రహదారులు చేపట్టాలని అన్నారు. రహదారి వెంబడి కావాల్సిన విద్యుత్‌లైన్,స్తంబాలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు భవనాలు,పంచాయతీరాజ్‌శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలన్నారు. రెవిన్యూ అధికారులు సర్వేచేపట్టి,హద్దులు ఫిక్స్ చేయాలన్నారు. మున్నేరు రిటైనింగ్‌వాల్ ప్లాన్ ప్రకారం చర్యలు తీసుకోవాలి అన్నారు. భవిష్యత్ తరాలకు ఉపయోపడేవిధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దానవాయిగూడెం చెక్‌డ్యామ్ ఎత్తు పెంచాలన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు ఆలోచనచేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వ్యంతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. తొలుత మంత్రి పామాయిల్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఇచంద్రమౌళి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ శ్యామ్‌ప్రసాద్, జిల్లా హార్టికల్చర్ అధికారి రమణ, ఇరిగేషన్ ఇఇ వెంకటేశ్వరరావు, జిల్లా పర్యాటక అధికారి సుమన్‌చ్రవర్తి, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి,గురుదత్తా ఫౌండేషన్ సభ్యులు వి.లక్ష్మయ్య, సిహెచ్ వెంకటేశ్వరరావు, శంకరయ్య, కృష్ణయ్య, ప్రభాకర్‌రావు, ప్రసాద్, రాంరెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు పేదలకు వరం

### పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/పినపాక: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని పేద ప్రజలకు వరమని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన పినపాక మండల పర్యటనలో భాగంగా నూతనంగా నిర్మించిన ఏడూళ్ళ బయ్యారం, మల్లారం గ్రామ పంచాయతీ కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరం గ్రామస్తుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలపై వినతి పత్రాలు ఎమ్మెల్యే కు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారిని సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రతి ఒక్కరినీ పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకు మేలు జరిగే విధంగా రూపకల్పన చేశారని తెలిపారు. మహిళలు బాగుంటేనే వారి ఇల్లు బాగుంటుందని, తద్వారా సమాజం, రాష్ట్రం బాగుండాలనే లక్ష్యం తో సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళా సాధికారత కోసం ఇంత చేస్తున్న ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని అభినందించకపోయినా ఫర్వాలేదు గానీ, పనీ పాట లేని పది మంది పోగై ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన హామీలు ఐదు అమలు చేశామన్నారు. మహిళ పేరుతోనే ఇళ్ళు రాబోతున్నాయని గత ప్రభుత్వంలో మాదిరిగా ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పనిలేదని, ఎవరి సిఫార్సులు అవసరం లేదన్నారు. భారతదేశంలో మహిళలు ముఖ్యమంత్రులుగా పనిచేస్తున్న రాష్ట్రాల్లో కూడా మహిళలకు ఇన్ని సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, మహిళలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారన్నారు. జిల్లా మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలుపవచ్చని, మణుగూరు ప్రజా భవన్ కార్యాలయంలో అందుబాటులో ఉంటామన్నారు. తనను కలవడానికి ఎటువంటి ఫైరవీలు అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈ ఈ బీ మంగ్యా నాయక్, డీ ఈ సైదుల్ రెడ్డి, మండలస్పెషల్ ఆఫీసర్ హెచ్ వీ రామ్ ప్రసాద్, ఏ ఈ రెహ్మార్డ్ , ఎంపిడిఓ రామకృష్ణ, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం, యువజన కాంగ్రెస్ నాయకులు కొర్సా ఆనంద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మీ రెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, తోలెం కల్యాణి, సురెడ్డి తిరుపతి రెడ్డి, పేరం వెంకటేశ్వరరావు, కొమరం వెంకటేశ్వర్లు, భద్రి, తోలెం అర్జున్, యాలం బుచ్చిబాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు కారం బాలకృష్ణ, వీ.వీరభద్రం, మాజీ సర్పంచులు, సెక్రటరీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైనిక్ స్కూల్ ఫలితాల్లో బ్రిలియంట్ విద్యార్థుల ప్రభంజనం









ప్రజాపక్షం/బూర్గంపాడు: సైనిక్ స్కూల్ ఫలితాలలో బ్రిలియంట్ విద్యార్థుల ప్రభంజనం స్థానిక సారపాక బ్రిలియంట్ విద్యార్థులు గురువారం ప్రకటించిన జాతీయ స్థాయి సైనిక్ స్కూల్ ఫలితాలలో మరొకసారి చరిత్ర సృష్టించారు. జీ ఋత్విక్ రామ్, యూ జయ భార్గవ్, పి దీపక్ సాయి, శ్రీరామ్ తేజ్, ఏ పృథ్వీ, సాయి చరణ్‌రెడ్డి, కే నేత్ర నిఖిల్, ఎస్ అజయ్‌కుమార్, ఎల్ గౌతమ్‌లు సారపాక కీర్తి పతాకాన్ని మరొకసారి ఎగురవేశారు. ఈవిద్యార్థులు బ్రిలియంట్ విద్యాసంస్థల ఛైర్మన్ బిఎన్ఆర్ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు సాధించిన విజయాన్ని ఉద్దేశించి బ్రిలియంట్ విద్యా సంస్థల అధినేత బిఎన్ఆర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సైనిక్ స్కూల్, నవోదయలో సీట్లు సాధించడం బ్రిలియంట్ స్కూల్ ఆనవాయితీగా వస్తోందని, ఇలానే ముమ్ముందు కూడా సీట్లు సాధిస్తామని తెలిపారు. ఈవిజయానికి సహకరించిన తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ అతి సాధారణ మారుమూల గ్రామాల నుంచి మా పిల్లలను సైతం జాతీయ స్థాయి వంటి పోటీ పరీక్షలకు పంపించి నవోదయ సైనిక్ స్కూల్‌లో సీట్ల సాధించి పిల్లల ఉన్నతికి దోహదపడుతున్నందుకు బిఎన్ఆర్‌ని ఎంతగానో ప్రశంసించారు. ఈకార్యక్రమంలో సైనిక్ స్కూల్‌లో సీట్లు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదానికి 25 క్వింటాళ్ల బియ్యం



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి ఐటిసి పిఎస్‌పిడి సంస్థ 25 క్వింటాళ్ల బియ్యాన్ని వితరణగా ఇచ్చింది. ప్రతీ ఏటా ఇచ్చే మాదిరిగానే ఈ ఏడాది కూడా అందజేశారు. ఏప్రిల్ 17న శ్రీరామ నవమి, 18న మహా పట్టాభిషేకం వేడుకలు ఉన్నందున బియ్యాన్ని వితరణగా అందజేస్తున్నట్లు యూనిట్ హెడ్ చెంగళ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి మాట్లాడుతూ ప్రతీ ఏటా దేవస్థానానికి ఐటిసి బియ్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. దేవస్థానానికి పలు విధాలుగా ఐటిసి పిఎస్‌పిడి సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా రాముల వారి ఆశీస్సులు వారికి మెండుగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ పాకాల దుర్గా ప్రసాద్, దేవస్థానం ఏఇఓ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన నిరుద్యోగులు సింగరేణి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి



ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు సింగరేణి ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ సింగరేణి నోటిఫికేషన్‌లో గల మేనేజ్మెంట్ ట్రైనీ, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, సబ్ ఓవర్ సిర్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. గిరిజన అభ్యర్థులకు పరీక్ష ఫీజులో మినహాయింపు ఉందని, ప్రాసెసింగ్ ఫీజు రూ.100 చెల్లిస్తే సరిపోతుందని అన్నారు. మిగతా అన్ని వివరాల కోసం వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

## పల్లపు మృతి పట్ల సంతాపం



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ పరిధి లోని ఆదర్శనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లపు తిరుమలేశు పెద్ద కుమారుడు పల్లపు ముత్యాలరావు గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న, లక్ష్మీ కుమారి, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్ , సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగ మోహన్ రావు, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ జిల్లా సమితి సభ్యులు ఎస్ కే సర్వర్, మంగి వీరయ్య, సోందే కుటుంబరావు, ఆధర్ల రాములు, రాయలింగం, యనమల సుధాకర్ తదితరులు పాల్గొని పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



ప్రజాపక్షం/పినపాక: గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ దుర్గా భవాని కోరారు. శుక్రవారం ఉప్పాక గ్రామపంచాయతీ పరిధిలో గల ఎర్రగుంట వలస ఆదివాసి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఎం.ఎల్ హెచ్‌పి రామరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గాభవాని మాట్లాడుతూ వలస ఆదివాసి గ్రామాలతో పాటు గ్రామ పంచాయతీల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అలాగే ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వేసవిలో బయటికి వెళ్లేటప్పుడు వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి అని తెలిపారు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో నాటు మందులు వాడకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, పాల్గొన్నారు.

# ఈజిఎస్‌ను రద్దు చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం

**-బడ్జెట్ కేటాయింపుల్లో కోత -కూలీ రేట్లను పెంచాలి**
**-వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) పథకానికి తూట్లు పొడిచేవిధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అవసరమైతే రద్దు చేయాలన్న ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఇప్పటికే బడ్జెట్‌లో కోత విధించిందని ఆయన తెలిపారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న కార్మికులను కలిసి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రోజు వారి కూలీ, పనుల వద్ద వసతులు, ఇతర అంశాలను కార్మికుల ద్వారా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోజు వారి వేతనం రూ.272 అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో జాతీయ ఉపాధి హామీ పథకానికి ప్రస్తుతం ఉన్న జాబ్‌కార్డులకు అనుగుణంగా మూడు లక్షల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని కానీ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.50వేల కోట్లను మాత్రమే కేటాయించిందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో కోత కారణంగా జాతీయ ఉపాధి హామీ పథకానికి కోత పడే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని రద్దు చేస్తే దేశ వ్యాప్తంగా 25 కోట్ల మంది ప్రజలు ఇబ్బందులు పడతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పగిళ్ల వీరభద్రం, ముత్తగూడెం శాఖ కార్యదర్శి దొంతగాని రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చర్లలో నేడు బిఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

**- బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జీగా రావులపల్లి ?**



**ప్రజాపక్షం/భద్రాచలం :** బిఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నేడు నియోజకవర్గంలోని చర్ల మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి రాజ్య సభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధు తోపాటు ఎంపి మాలోత్ కవిత, జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావుతో పాటు పలువురు హాజరుకానున్నట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, నేటి మధ్యాహ్నం 3 గం. నుండి ఎన్నికల కోడ్ అమల్లోనికి వస్తున్నందున జరగబోయే ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఉండనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ భద్రాచలం నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి గెలిచినందున రాష్ట్ర అధినాయకత్వం భద్రాచలంపై నజర్ పెట్టినట్లు సమాచారం. భద్రాచలం నియోజకవర్గాన్ని రాబోయే రోజుల్లో చేజార్చుకోకుండా ఉండేందుకు, ఎంపి ఎన్నికల్లో పెద్ద మొత్తంలో ఓట్లు రాబట్టుకునేందుకు ఇప్పటి నుండే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం సాక్షిగా ముఖ్యకార్యకర్తకు దిశా నిర్దేశాన్ని చేయనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన రీతిగానే ఎంపి ఎన్నికల్లో పనిచేసేందుకు ఉత్సాహాన్ని నింపబోతున్నట్లు తెలుస్తోంది.

**నియోజకవర్గ ఇంచార్జ్‌గా రావులపల్లి ..?**

బిఆర్ఎస్ పార్టీ బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా రావులపల్లి రాంప్రసాద్‌ను నియమించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా సుదీర్ఘ అనుభవన ఉన్న ఆయన సుమారు 30 ఏళ్లకుపైగా ఏజెన్సీలో పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పలు కారణాల వల్ల సిపిఐ ను వీడి బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకుని బిఆర్ఎస్ గెలుపుకు కీలక పాత్ర పోషించారు. దీంతో ఆయన పనితనాన్ని గుర్తించిన బిఆర్ఎస్ అధినాయకత్వం నియోజకవర్గంలో పార్టీ మరింతగా బలపడాలంటే రావులపల్లి సేవలు అవసరమని గుర్తించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా నేడు చర్లలో జరిగే సమావేశంలో ఆయన పేరును ఏకగ్రీవంగా ప్రకటించనున్నట్లు సమాచారం.

# పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాచలం :** పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆలా ఆదేశించారు. ఈనెల 18 నుండి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఇందు కోసం 73 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుధ్యంతో పాటు తాగునీరు, విద్యుత్ సౌకర్యం తప్పని సరిగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షా పత్రాల గోప్యతను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. పరీక్షా పత్రాలను సురక్షితంగా పోలీస్ స్టేషన్ల నుండి పరీక్ష కేంద్రాలకు తరలించాలని, పరీక్ష నిర్వహణ కోసం 71 మంది చీఫ్ సూపర్వైజర్లు, 73 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 720 మంది ఇన్విజిలేటర్లు, ఐదుగురు ఫ్లైయింగ్ స్కాడ్‌లను నియమించినట్లు చెప్పారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చూడాలని, పిల్లలంతా స్వేచ్ఛాయిత వాతావరణంలో ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరచారి, అన్ని మండలాల ఎంపిడిఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిఆర్‌డిఓ విద్యా చందన తదితరులు పాల్గొన్నారు.

# ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆలా అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో ధరణి, కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్, మీ సేవా ధృవీకరణ పత్రాలు, సీతమ్మసాగర్, ఇసుక రీచ్‌లు, అటవీ భూములు తదితర అంశాల్లో పెండింగ్‌లో ఉన్న ఉన్న వాటిపై రెవెన్యూ, అటవీ, సర్వే అధికారులతో సమాశం నిర్వహించారు. ధరణి దరఖాస్తులను వ్యక్తిగతంగా పరిశీలన చేయాలన్నారు. రానున్న ఏడు రోజుల్లో పెండింగ్‌లోఉన్న ధరణి ఫిర్యాదులన్నీ పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి నోచుకోనివాటిపై సమగ్ర నివేదికలు అందజేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా డాక్యుమెంట్ ఉండాలని చెప్పారు. కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పెండింగ్ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలన్నారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ వేగవంతం చేయాలని ల్యాండ్ బ్యాంకు కు ఇచ్చిన భూముల్లో ఆక్రమణలకు గురైతే నెంబర్లతో సహా నివేదికలు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి దరఖాస్తులను రెండు రోజుల్లో పూర్తి చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. జిల్లా లెవల్ సాండ్ కమిటీ ద్వారా 9 ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చామని, రానున్న రెండు రోజుల్లో మరో రెండు ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇస్తామని చెప్పారు. ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలన్నారు. అటవీశాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని, కొత్తగా పోడు నరికే వారిపై చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ అధికారులు గిరిజనులకు పోడు వ్యవసాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ విద్యాచందన, ఆర్‌డిఓలు మధు, దామోదర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఏఓ గన్య, అన్ని మండలాల తహశిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# చేపపిల్లల పెంపకంపై వ్యవసాయ, మత్స్యశాఖల శిక్షణ



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెం గ్రామంలో గల రిషిక్ ఆక్వా ఫార్మ్‌లో వ్యవసాయ,మత్స్యశాఖల ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు నైపుణ్యత శిక్షణను శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చేపపిల్ల పెంపకం ఏవిధంగా చేయాలి అనే విషయాలను ప్రత్యక్షంగా వివరించారు. అదేవిధంగా పెంపకంలో యాజమాన్య పద్ధతులను పాటించడం నేర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయధికారి ఎమ్ విజయనిర్మల, ఫిషరీస్ ఏడిఏ ఆంజనేయస్వామి, ఏఓ అరుణ జ్యోతి, శరత్‌బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# షాపింగ్ కాంప్లెక్స్ బహిరంగం వేలం

**ప్రజాపక్షం/సుజాతనగర్:** మండల కేంద్రంలోని షాపింగ్ కాంప్లెక్స్ నాలుగు రూములు నెలవారి అద్దె వసూలు చేసుకొనుటకు వేలంపాట నిర్వహించినట్లు సుజాతనగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బి నరేంద్ర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 నెలల పాటు కాలానికి బహిరంగ వేలం పాట ఉంటుందని ఈనెల 18వ తేదీ గ్రామ పంచాయతీ కార్యాలయం నందు వేలం పాట జరుగుతుందని తెలిపారు. వేలం పాట నియమ నిబంధనల ప్రకారం జరుగుతుందని ప్రత్యేక అధికారి మండల పంచాయతీ అధికారి సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని ఆసక్తిగల వారు హాజరవ్వాలని తెలిపారు.

# అన్నారుగూడెం జెడ్పిహెచ్ఎస్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో వార్షికోత్సవం సందర్భంగా 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులకు శుక్రవారం పాఠశాల స్థాయిలో చిత్రలేఖనం ద్వారా వివిధ చిత్రాలకు రూపొందించి ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఇఓ నెమ్మకంటి దామోదర్ ప్రసాద్ ప్రారంభించి విద్యార్థులు వివిధ రంగులతో రూపొందించిన పలు చిత్రలేఖన రూపాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో చిత్రలేఖనం ద్వారా ప్రతిభాపాఠవాలు మెరుగవుతాయని, అంతేకాకుండా పిల్లల్లో మానసిక ఉల్లాసం, సృజనాత్మక పెంపొందుతాయని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం మాదినేని నర్సింహారావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవుల పశ్చాతప పాదయాత్ర



**ప్రజాపక్షం/ తల్లాడ :** క్రైస్తువుల తపస్సు కాలంలో భాగంగా తల్లాడ లూర్దు మాత పుణ్యక్షేత్రం చర్చ్ నుండి గోపాలపేటలోని లూర్దు గిరి కొండ వరకు పశ్చాతప పాదయాత్రను శుక్రవారం నిర్వహించారు. ఈ యాత్రలో తల్లాడలోని పలు గ్రామాల దీక్ష సహోదరీ, సహోదరులు, సిస్టర్స్,ఫాదర్స్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో క్రీస్తు ప్రభువు శిలువ శ్రమలను ధ్యానించుకుంటూ వచ్చారు. ప్రతిఒక్కరూ జాలి, ప్రేమ, కరుణ కలిగి ఉండాలని, ఎదుటి వారికి సహాయంచేయాలని, మన శత్రువులను సైతం ప్రేమించాలని అమూల్యమైన సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫాదర్స్ అజయ్, ఫ్రాన్సిస్, మరియన్న, మనోజ్ సిస్టర్స్, పంతుగార్లు, సంఘ పెద్దలు, దీక్ష సహోదరీ, సహోదరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసి ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారికి వినతి



**పజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** కొత్తగూడెం పట్టణంలో వీధి వ్యాపారులు, పుట్‌పాత్ వ్యాపారులు తమ వ్యాపారాలను సజావుగా నడపలేకపోతున్నామని శుక్రవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో కొత్తగూడెం సబ్ డివిజనల్ పోలీస్ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి గిద్దాడ నగేష్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు సాగిస్తూ కుటుంబాలను సాకుతూ చాలీచాలని జీవితాలను అనుభవిస్తున్నారని అన్నారు. పట్టణంలోని పోలీసులు తమపై అనేక రకాల కేసులను నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. తమపై జరిమానాతో కూడిన కేసులను సైతం విధిస్తున్నారని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోపుడు బండ్ల వ్యాపారస్థులు, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వ విద్యాలయ ఏర్పాటు హామీని నెరవేర్చాలి

**-పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంటును విడుదల చేయాలి**

**-ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి, ఉద్రిక్తత**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ విశ్వ విద్యాలయ ఏర్పాటు హామీ కలగానే మిగిలిందని మంత్రులు దృష్టి సారించి ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం వందలాది మంది విద్యార్థులతో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్సిటీలు ఉన్నాయని ఖమ్మంజిల్లా మాత్రమే ఏర్పాటు చేయలేదన్నారు. 2008లోనే నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ఖమ్మంలో ప్రకటించి విస్మరించిన విషయాన్ని గుర్తు చేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. యూనివర్సిటీ సాధన కోసం దశాబ్దాల కాలంగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీ ఏర్పాటుకు చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు. యూనివర్సిటీ ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలో కావాల్సిన వసతులు ఉన్న ప్రభుత్వాలు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు. జిల్లాలో 90వేలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, 200 వరకు కళాశాలలు ఉన్నాయని జిల్లా మంత్రులు చొరవ చూపి యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు రూ. 7వేల కోట్లు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. డిగ్రీ, పిజీ పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభించిందని ఈ ప్రభుత్వం కూడా విద్యా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కాంగ్రెస్ 100 రోజుల పాలనలో విద్యా రంగానికి ఒరిగింది ఏమీ లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్పులు, ఫీజు రీయంబర్స్‌మెంట్లు వెంటనే విడుదల చేయాలని, యూనివర్సిటీ ఏర్పాటు సత్వరమే చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు చేపడతామన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టరేట్ ముట్టడికి యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు నాగులమీరా, చందులాల్, సురేష్, ప్రతాప్, రాకేష్, రాజు, అయ్యప్ప, నరేష్, గోపి, సాయి, ఉమామహేష్, పావని, రజిత, లలిత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీదే..

**- జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆలా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీదే జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆలా అన్నారు. జిల్లాలోని యుడైస్ డేటా ప్రకారం గుర్తించబడిన 697 పాఠశాలల్లో అత్యవసరమైన మౌళిక వసతులు కల్పినకు రూ.22.69 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, లోకల్‌బాడీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంపిడిఓలు, అన్ని ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, డిఆర్‌డిఓ, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో ఆమె మాట్లాడారు. విడుదల చేసిన నిధులతో 697 బడుల్లో అత్యవసర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మైనర్, మేజర్ రిపేర్లు, విద్యుదీకరణ, తాగునీటి వసతి, మరుగుదొడ్లు వంటివాటిని గుర్తించి పూర్తి చేయాలని, ఈపనులు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారానే చేయనున్నట్లు చెప్పారు. కేటాయించిన నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. పనుల అంచనాలు తయారు చేసి తీర్మాణాలు చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ విద్యా చందన, జిల్లా విద్యాధికారి ఎం వెంకటేశ్వర చారి, వివిధ ఇంజనీరింగ్ విభాగాల ఎస్ఇలు తదితరులు పాల్గొన్నారు.

# సొంత మరదలు అని జాలి చూపిస్తే నిండాముంచింది

**తప్పుడు ధృవపత్రాలతో భూమినమోదు చేసుకుని విక్రయించేందుకు కుట్ర**

**ఖమ్మం రెవిన్యూ డివిజనల్ అధికారికి బాధితుడు ఫిర్యాదు**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** తోడబుట్టిన తమ్ముడు అనారోగ్యంతో మృతి చెందడంతో తమ్ముడి భార్య అని జాలి చూపించి అంతా తానై కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటే కనీసం సొంత బావ అని చూడకుండా తప్పుడు ధ్రువత్రాలు సృష్టించి అధికారులను ప్రలోభ పెట్టి తనకు రావలసిన భూమిని తన పేరుపై నమోదు చేసుకుందని ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారికి బాధితుడు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ గ్రామానికి చెందిన చీమ బొందయ్యకి ఆరుగురు సంతానం కాగా ఇద్దరు కుమారులు నలుగురు కుమార్తెలు ఉన్నారు. కూసుమంచి మండలం చేగొమ్మ రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 49లో 8ఎకరాల భూమి బొందయ్య సంపదించిన వ్యవసాయ భూమిలో పెద్ద కుమారుడు చీమ లక్ష్మయ్య చిన్న కుమారుడు చీమ నారాయణకు సమాన వాటాలు పంచగా నారాయణ భార్య చీమ ఈరమ్మ పసుపు కుంకుమ కింద ఈరమ్మ తండ్రి 30గుంటలు భూమిని ఇచ్చాడు. 49సర్వే నెంబర్‌లో ఒకే నెంబర్‌పై మామ చీమ బొందయ్య తండ్రి గోవింద మదర్ పంపించిన ఆస్తిని పట్టా చేయించుకుని అంతా మా మామ బొందయ్య ఇచ్చాడరని చెప్పుకుంటుందని బావ లక్ష్మయ్య పేర్కొంటున్నారు. ఉమ్మడి కుటుంబంలో సొంతంగా కొనుగోలు చేసిన 20కుంటల భూమిని వీరమ్మ తప్పుడు ధృవత్రాలు సృష్టించి అధికారులను ప్రలోభ పెట్టి పట్టా చేయించుకుని మోసం చేసిందని ఆరోపిస్తున్నాడు. తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 213గోవింద మదర్ వద్ద 1986లో సుమారు 40సంవత్సరాల క్రితం రెండు ఎకరాల భూమిని చీమ లక్ష్మయ్య కష్టార్జితంతో కొనుగోలు చేశాడు. చీమ లక్ష్మయ్య తండ్రి బొందయ్య పిఫారసు మేరకు చిన్న చెల్లెలు గుంజులూరి పద్మకి పసుపు కుంకుమ కింద ఎకరం ఇరవై కుటుంల భఫ్తమిని ఇచ్చినాడు. ఇట్టి క్రమంలో 93,94 సంవత్సరంలో ఆ భూమిని మా చెల్లెలు మా తమ్ముడు చీమ నారాయణ పేరుమీద పహానిలో ఎక్కించాడు. మిగతా 20కుంటల భూమినకు చెందుంతుందని ఖమ్మం రెవిన్యూ డివిజన్ అధికారికి చీయ లక్ష్మయ్య ఫిర్యాదు చేశాడు. తమ్ముడు చీమ నారాయణ బ్రతికి ఉన్నంతకాలం మంచిగా ఉండి తమ్ముడు చనిపోవడంతో ఆస్తికోసం సొంత కుటుంబ సభ్యులను సైతం లెక్కచేయక తప్పుడు ధ్రువత్రాలు పెట్టి భూమిని ఎక్కించుకుని సమాజంలో పేరు పొందిన కుటుంబానికి అపనిందలు వేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఉన్నాతాధికారులు స్పందించి నాకు రావాల్సిన భూమిని పట్టా చేయించవలసిందిగా చీమ లక్ష్మయ్య కోరుతున్నాడు.

# చెన్నూరులో సిలువ మార్గ ప్రదర్శన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం చెన్నూరులో ఆర్.సి.యంచర్చి ఆధ్వర్యంలో సిలువ మార్గ ప్రదర్శన పురవీధులలో జరిగింది. ఏసుప్రభు మరణ సమయంలో 14 సార్లు పడిన పాటులను స్మరించుకుంటూ బైబిల్ వాక్యాలను చదువుకుంటూ, పాటలను పాడుతూ పురవీధులలో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు జరిగాయి. మత గురువులు జోజి బాబు మాట్లాడుతూ పాపుల రక్షణార్థమై కల్వరి కొండలో క్రీస్తు ప్రభువు రక్తాన్ని చిందించి మరణించాడని ఆయన లో ఆదర్శంగా తీసుకుంటూ జీవిస్తూ ఉండాలని క్రైస్తవులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపదేశకులు, సంఘ పెద్దలు, సంఘస్తులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

# మానవ వనరులు అభివృద్ధి చెందాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మణుగూరు సెక్టార్ పరిధిలోని మణుగూరు1, మణుగూరు4 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని తల్లులకు సమావేశపరచి వారికి వారి ఇంటి దగ్గర తయారు చేసిన చిరు ధాన్యాలతో వివిధ రకాల వంటకాలు వండుకుని రమ్మని చెప్పారు. వండిన వంటల గురించి వారిని అందులో ఉన్న పోషక విలువలు తయారు చేసిన విధానంపై మాట్లాడించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుశీల మాట్లాడుతూ దేశాభివృద్ధి జరగాలంటే మానవ వనరులు అభివృద్ధి చెందాలన్నారు. సీజనల్‌గా దొరికే పండ్లు, కూరగాలు తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, గర్భిణీలు, బాలింలు, అంగన్‌వాడీ టీచర్లు డి. మల్లీశ్వరి, కె. సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి మండలాన్ని అభివృద్ధి చేయండి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సీతారామ ప్రాజెక్ట్ నీళ్ళు జూలురుపాడు మండలం నుంచి చీమలపాడు అటవీ ప్రాంతం నుండి స్వరంగ మార్గం గుండా సింగరేణి మండలానికి తీసుకురావాలని ఎమ్మెల్యేని కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు, మల్లెల నాగేశ్వరరావు, అజ్మీరా నరేష్‌నాయక్, తోగరు శ్రీను కలిసి చర్చించారు. స్పందించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తప్పకుండా ప్రయత్నం చేద్దాం అన్నారు. దాంతో పాటు కాంగ్రేస్ నాయకులు కలిసి పార్టీ అభివృద్ధికి మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

# గోవిందరాజు జాతర గోడపత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/గుండాల :** సనప వంశీయులు తమ ఆరాధ్యదైవంగా కొలుసుకునే శ్రీ కోవిందరాజు జాతర గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 20,21,22 న జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవత ఆశిస్సులను పొందాలని సనప కోటేశ్వరావు, సనప సుగునారావు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడురోజల పాటు జరిగే వేడుక తంతును తిలకించాలని కోరారు. అలాగే ఈ జాతర కార్యక్రమం సందర్భంగా యువతకు వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి బహుమతి రు.10116, రెండోవ బహుమతి రు.5116 ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో తలపతులు సనప రాంబాబు, స్వామి, రాంచందర్, శ్రీను, క్రిష్ణ, సుదాకర్, నాగేశ్వరావు, వడ్డె కల్తి సర్వయ్య పాల్గొన్నారు.

# అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలను ఎంచుకోవాలి



**ప్రజాపక్షం/గుండాల :** రబీ సీజన్‌లో రైతులు అధిక దిగుబడినిచ్చే మేలైన రకాల విత్తనాలను ఎంచుకోవాలని ప్రభాత్ సీడ్స్ డిప్యూటి జనరల్ మేనేజర్ శ్రీన్‌వాస్ రెడ్డి కోరారు. శుక్రవారం ముత్తాపురం గ్రామంలో ప్రబాత్ సీడ్స్ వారి హైబ్రీడ్ మొక్కజొన్నమార్క్ రకం పై రైతు ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు.ప్రబాత్ కంపెని ద్వారా అందిచే మాక్స్ అనేరకం మొక్కజొన్న అత్యదిక దిగుబడిని ఇస్తుందని అన్ని సమానమైన పెద్ద కంకులను కలిగి, గింజబరువుఅధికంగా ఉండి, తెగుళ్ళ బారినుండి తట్టుకో గలుగుతుందని తెలిపారు. అదేవిదంగా ఖరీఫ్‌లో రుద్రమరియు రాంబొ అనే రెండు రకాలు అధిక వర్షాలను తట్టుకోగలవని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సత్యం, కంపెని ప్రతినిదులు పాండు రంగా రెడ్డి, సుబ్బారావు, రమేష్ , మానాల ప్రనీత్ పాల్గొన్నారు.

# ఘనంగా నామ జన్మదిన శుభాకాక్షలు



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం పార్లమెంటు సభ్యులు, పార్లమెంటులో బిఆర్‌ఎస్ పార్టీ పక్షనేత రాబోయే ఎన్నికల్లో మరోసారి బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా ఖమ్మం నుంచి పోటీచేయుచున్న నామ నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుక వైరా పట్టణ, మండల కమిటీ నుంచి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జున్‌రావు, వైరా మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు షేక్ లాల్‌మహ్మద్, వైరా మార్కెట్ మాజీ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ మోటపోతుల సురేష్, పట్టణ నాయకులు, మాదినేని ప్రసాద్, కౌన్సిలర్ తడికమళ్ళ నాగేశ్వరరావు, ఏదునూరి శ్రీను, గుజ్జర్లపూడి దేవరాజు, మాదినేని లక్ష్మణ్, దాసరి శ్రీనివాసరావు, దొంతబోయిన వెంకటేశ్వర్లు, గోపి, రవి, నందిగామ మనోహర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఆగని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు..!



-పట్టుబడుతున్నా.. మార్పు రాని వైనం
-కొంతమందికి జరిమానా..మరికొంతమందికి జైలుశిక్ష
-మద్యం మత్తులో వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు : సిఐ సాగర్



**ప్రజాపక్షం/వైరాః** మద్యం త్రాగి వాహనాలు నడపవద్దని జిల్లావ్యాప్తంగా పోలీసులు తనిఖీలు నిర్వహించి పదేపదే చెబుతున్నా కొంత మంది వాహనదారులు పోలీసులు సూచనలు పెడచెవిన పెడుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు అతివేగంగా నడుపుతూ రోడ్లపైకి వస్తున్నారు. అలా మద్యం మత్తులోనే ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు కారణమవుతుఆన్నరు. మద్యం త్రాగి వాహనాలు నడిపేవారిని పట్టుకునేందుకు జిల్లావ్యాప్తంగా పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు విస్తృతం చేసినా కొంతమంది వాహనదారులు మార్పు రావడం లేదు.

**మద్యం తాగి వాహనాలు నడిపితే భీమా వర్తించదు..!**

మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం అని తెలిసిన కొంతమంది వాహనదారులు తేలిగ్గా తీసుకుంటున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు, ఇతర వాహనాలు ఢీకొట్టి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇలాంటి వారంతా మద్యం మత్తులో వాహనాలు అతివేగంగా నడిపి ప్రమాదాలకు గురైతే ఇకపై అలాంటి వారు వాహన భీమా ప్రయోజనాలు పొందలేరు. మద్యం త్రాగి వాహనాలు నడిపినట్లు కేసులు నమోదు అయితే వారు అనర్హులు అవుతారు. గతంలో పోలీసులకు ప్రమాదానికి కారకులను గుర్తించడం వారి ఆధారాలు సేకరించడం కష్టంగా ఉండేది. ఇటీవల నూతన టెక్నాలజీ, నూతన సాఫ్ట్‌వేర్‌తో ప్రమాదాలు జరిగిన వెంటనే వాహనదారులు నుంచి వారి రక్తనమూనాలు తీసుకుంటున్నారు. ఒకవేళ ఎవరైనా చనిపోతే జీర్ణాశయం నుంచి నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబొరేటరీకి పంపిస్తున్నారు. మద్యం తాగి వాహనం నడిపినట్లు శాస్త్రీయంగా నిరూపించి ఐపిసి సెక్షన్ 304ఏ క్రింద కేసు నమోదు చేస్తున్నారు. ఫలితంగా ప్రమాద సమయంలో మరో వాహనదారుడిపై కేసు లేకుండా పోవడంతో మరణించిన వారికి సంబంధించిన ప్రయోజనాలు కేసుకు సంబంధించిన పరిహారం దక్కకుండా పోతుంది. అప్పుడు ఆ కుటుంబం సభ్యులు భీమా రాకపోవడంతో నష్టం జరుగుతుంది.

**ఆల్కహాలు పాయింట్ల ఆధారంగా శిక్ష**

జిల్లాలో డ్రంక్‌డ్రైవ్ కేసులు బాగా నమోదు అవుతున్నవి. కొంతమందికి జరిమానా విధించడం. కొంతమందికి జైలుశిక్ష పడుతుంది. గతేడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగగా చాలా మరణించారు. ప్రస్తుతం జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో బ్రీతింగ్ అనలైజర్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అనలైజర్ పైపును నోట్లో పెట్టుకొని గట్టిగా గాలి ఊదితే ఎంత మద్యం తాగామన్నది అనలైజర్ మిషన్‌లో నమోదవుతుంది. ఆల్కహాల్ శాతం 30 కంటే ఎక్కువ ఉంటే మద్యం తాగినట్టుగా గుర్తించిన పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఆల్కహాల్ 100 పాయింట్లు దాటితే వాహనాలు స్వాధీనం చేసుకొని కేసులో శిక్షపడిన తర్వాత తిరిగి వాహనం అప్పగిస్తారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో ఎక్కువగా పోలీసులకు 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిగా పోలీసులు గుర్తిస్తున్నారు. బ్రీతింగ్ అనలైజర్‌లో ఏ సమయంలో పరీక్ష చేశారు. ఎంత పరిమాణంలో మద్యం తాగారనే పూర్తి వివరాలు నమోదవడం ద్వారా కేసు విచారణలోను ఆలస్యం ఉండదు. ఒకటి కన్నా ఎక్కువ సార్లు మద్యం మత్తులో పోలీసులకు పట్టుబడితే వాహనదారుల లైసెన్స్ రద్దు చేసే అవకాశం లేకపోలేదు అని అధికారులు తెలుపుతున్నారు.

**మద్యం మత్తులో పట్టుబడితే చట్టప్రకారం చర్యలు : సిఐ సాగర్**



మద్యం మత్తులో వాహనాలు నడపడం వలన చట్టరీత్యా నేరం. అలా పట్టుబడితే రెండు రోజుల నుంచి నెల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. పోలీసులు తనిఖీల్లో పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నాం. మద్యం తాగి ఎవరు వాహనం నడపకూడదు. మద్యం మత్తులోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. రోడ్డు ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబాలు పడే బాధ ఇబ్బందులు చెప్పలేనివి అని వైరా సిఐ నునావత్ సాగర్ తెలిపారు.

# డిసిసిబి సమావేశం రసాభాస

-నిర్ణయాలు లేకుండానే వాయిదా



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖాళీ అయిన డైరెక్టర్ల స్థానాలకు కొత్త వారిని ఎన్నుకునేందుకు శుక్రవారం నిర్వహించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశంలో గందర గోళం నెలకొంది. ఎటువంటి నిర్ణయాలు లేకుండానే సమావేశం వాయిదా పడింది. సమావేశం ప్రారంభం కాగానే ఖాళీ అయిన జనరల్ డైరెక్టర్ల స్థానానికి సంబంధించి రావూరి సైదుబాబును కొందరు ప్రతిపాదించారు. ఈ దశలో డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య కొత్త ఛైర్మన్ ఎన్నిక కూడా నిర్వహించాలని పట్టుబట్టారు. డైరెక్టర్ల ఎన్నిక పూర్తయిన తర్వాతే ఛైర్మన్ ఎన్నిక జరగాలని అధికారులు సూచించారు. అయిన ఎజెండాలో లేకుండా అధ్యక్షుని ఎన్నిక నిర్వహించడం సాధ్యం కాదని సిఈవో అబీద్ ఉర్ రెహ్మాన్ స్పష్టం చేశారు. ఈ దశలో డైరెక్టర్ల ఎంపికకు సంబంధించి గందర గోళం నెలకొంది. మరో సమావేశం నిర్వహించి డైరెక్టర్లతో పాటు ఛైర్మన్ ఎన్నిక కూడా నిర్వహించేవిధంగా ఎజెండా రూపొందించాలని కోరడంతో డైరెక్టర్ల ఎన్నికకు సంబంధించి ఎటువంటి నిర్ణయం లేకుండానే సమావేశం వాయిదా పడింది. ఇక మహాజన సభలో బ్యాంకు వ్యవహార తీరును పలువురు ఛైర్మెన్లు తప్పుబట్టారు. కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మహాజన సభలో ఆరు నెలల ఆర్థిక లావాదేవీలకు సంబంధించి నివేదిక సమర్పించారు. 2024, 2025 ఆర్థిక సంవత్సరపు అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. అయితే కొందరు అధికారుల తీరును సొసైటీ ఛైర్మెన్లు తప్పుబట్టారు. కార్పొరేట్ బ్యాంకులను తలపించే రీతిలో డిసిసిబి అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ మహాజన సభలో సిఈవో అబీద్ ఉర్ రెహ్మాన్, పలువురు డైరెక్టర్లు, సొసైటీ ఛైర్మెన్లు పాల్గొన్నారు.

# న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో వీడ్కోలు సభ







**ప్రజాపక్షం/వైరాః** న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో పది స్టేట్, సిబిఎస్‌ఈ విద్యార్థులకు వీడ్కోలు జరిగింది. దీనికి కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్స్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్ పాల్గొన్నారు. పిల్లలు వారి వారి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకొని పాటలతో, డాన్స్‌లతో కేరింతలు కొట్టి వీడ్కోలు అంటూ వీడిపోమంటూ బాధ తప్త హృదయంతో వీడ్కోలు చెప్పుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్స్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్ మాట్లాడుతూ పది విద్యార్థులు మీకు మీ జీవితంలో పాఠశాలలో గడిపిన రోజులు మాత్రమే మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. అదే సమయంలో మీరు భాహ్య ప్రపంచానికి మిమ్మల్ని మీరు మంచిగా పరిచయం చేసుకోవడానికి సవాళ్ళను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అలాగే గతంలో సీనియర్‌లు అద్భుతమైన ఫలితాలతో అటు తల్లిదండ్రులకు ఇటు పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారని, అలాగే మీరు కూడా అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని ఆశిస్తూ మీరు లిటిల్ ఫ్లవర్స్ ఎక్కుపెట్టిన బాణాలు కాబట్టి మీ లక్ష్యాలను సాధించడంలో దూసుకెళ్లి అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని మాట్లాడారు. పది పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారని, కాబట్టి పరీక్షలకు వెళ్లేటప్పుడు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతోటి చదువుకొని మంచి జిపిఏ సాధించాలని, పిల్లలందరూ ఉన్నత విద్యను అభ్యసించి పాఠశాలకు మంచి పేరు తీసుకొని రావాలని సూచించారు. పూర్వ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలను జిల్లాలోని ప్రథమస్థానంలో నిలిపారని, మీరు కూడా బాధ్యతగా మెలిగి, క్రమశిక్షణ పట్టుదలను కలిగి సరైన లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భూమేష్‌రావు, డైరెక్టర్స్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, స్కూల్ ప్రిన్సిపాల్ షాజీ మ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో నకిలీ ఎస్ బిడీల కలకలం



-జోరుగా నకిలీ బిడీల విక్రయాలు
-కంపెనీ తనిఖీల్లో వెలుగులోకి..





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో నకిలీ ఎస్ బిడీలు కలకలం సృష్టించాయి. ఖమ్మంజిల్లాలో జోరుగా నకిలీ ఎస్ బిడీల విక్రయాలు జరుగుతున్నాయి. కంపెనీ తనిఖీల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గత కొంత కాలంగా ఎస్ బిడీ కంపెనీ విక్రయాలు తగ్గిపోవడంతో కంపెనీ ప్రతినిధులు దృష్టిసారించారు. పలు ప్రాంతాలలో కంపెనీ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఖమ్మం నగరంలో కంపెనీ ప్రతినిధులు పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా నకిలీ ఎస్ బిడీలు వెలుగులోకి వచ్చాయి. పలువురు దుకాణదారులు కంపెనీ ఎస్ బిడీలను పోలిన నకిలీ ఎస్ బిడీలను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ బిడీ డిస్ట్రిబ్యూటర్ మూన్‌లైట్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంపెనీ సేల్స్ మార్కెటింగ్ సూపర్ వైజర్ గౌస్ లతీఫ్, డిస్ట్రిబ్యూటర్ ఇజాహీద్ లు మాట్లాడుతూ గత కొంత కాలంగా ఎస్ బిడీలను పోలిన నకిలీ బిడీల అమ్మకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లో విస్తృత స్థాయిలో కంపెనీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నకిలీ ఎస్ బిడీల విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఖమ్మం నగరంలో కూడా తమ ఎస్ బిడీల విక్రయాలు తగ్గిందని దీనిపై దృష్టి సారించగా నకిలీ బిడీలు వెలుగులోకి వచ్చాయన్నారు. తమ కంపెనీ బిడీల కంటే నకిలీ బిడీల రేట్లు తక్కువగా ఉండడంతో పాటు అసలైన ఎస్ బిడీలను పోలిన ఎస్ బిడీలను తయారు చేస్తుండడంతో పలువురు వ్యాపారులు నకిలీ బిడీల విక్రయాలకు సహకరిస్తున్నారన్నారు. ఈ నకిలీ బిడీల వల్ల కోట్లు వెచ్చించి బిడీలు తయారు చేస్తున్న తమ కంపెనీకి నష్టాలు వచ్చే పరిస్థితి ఉందన్నారు. నకిలీ బిడీలు తయారు చేసే వారి సమాచారం అందించాలని కోరారు. నకిలీ బిడీల అమ్మకాలు జరిపినా, ప్రోత్సహించినా కంపెనీ పరంగా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా అసలు, నకిలీ బిడీలను మీడియా ముందు ప్రదర్శించారు. అసలు, నకిలీ బిడీల దిండు ఒకే రకంగా ఉన్నప్పటికీ కంపెనీ ఎస్ బిడీల దిండు, నకిలీ ఎస్ బిడీల దిండు కంటే కొంచెం పరిమాణం తక్కువగా ఉంటుందని వారు తెలిపారు.